క్లుప్తంగా

వడ్డికండ్రిగలో క్లోరినేషన్

దొరవారిసత్రం: వడ్డికండ్రిగ వీధుల్లో శనివారం బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ పనులను వైద్య, గ్రామ సచివాలయం సిబ్బంది చేశారు. గ్రామంలో పలువురికి జ్వరాలు రావడంతో విషయం తెలుసుకున్న వైద్యాధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. ఎంపీడీఓ శివ రాజు, ఏఓ రఘురామయ్య, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మధు పనులను పర్యవేక్షించారు. వడ్డికండ్రిగలో జ్వరాలు అదుపులోకి వచ్చేంతవరకు వైద్యశిబిరం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

లో ఓల్టేజీ పరిష్కారానికి చర్యలు

కోట: పట్టణంలో నెలకొన్న విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం విద్యుత్ అధికారులతో కలిసి ముస్లింవీధి, ఆకుతోటవీధి, ఎస్సీఆర్ నగర్‌లలో స్థానికులతో మాట్లాడారు. సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, రఘురామిరెడ్డి, నందగోపాల్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ



భూమిపూజలో ప్రజాప్రతినిధులు

కలువాయి: మండలంలోని చినగోపవరంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం పనులకు శనివారం భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో ప్లాంటును నిర్మిస్తున్నారు. ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెంచల నరసారెడ్డి, సర్పంచ్ జి.ఓబులమ్మ భూమిపూజలో పాల్గొన్నారు.

స్వామిత్వకు సిద్ధం కావాలి

చిల్లకూరు: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను గుర్తించి వాటిని సర్వే చేసి ప్రైవేట్ స్థలాలకు చెందిన యజమానులకు హక్కు పత్రాలను అందించేలా ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ కార్యక్రమానికి ప్రతి పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని ఈఓపీఆర్డీ మాణిక్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని పంచాయతీల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. స్వామిత్వపై కో–ఆర్డినేటర్ మనోజ్ఞని అవగాహన కల్పించారు.

ఏరులో పడి వ్యక్తి మృతి

దక్కిలి (బాలాయపల్లి): గేదెలను మేతకు తీసుకెళ్లి ప్రమాదవశాత్తు ఏరులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలాయపల్లిలో శనివారం చోటుచేసుకుంది. బాలాయపల్లికి చెందిన తాళ్లూరు వెంకటేశ్వర్లు (44) గేదెలను శనివారం మేతకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న గేదెలు ఒక్కసారిగా ఏరు దాటి పొలాలు సమీపంలోకి వెళ్లడంతో వాటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బాలాయపల్లి సమీపం కయ్యూరు కలుజు వాగులో వెంకటేశ్వర్లు పడి మృతిచెందాడు. మృతుడికి భార్య ,నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.



కలువాయి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



రాపూరు: వేపినాపిలో మానవహారం నిర్వహిస్తున్న చిన్నారులు

పోలియో చుక్కలు వేయించాలి

రాపూరు: మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు రాజకుమారి పేర్కొన్నారు. వేపినాపి గ్రామంలో పోలియో చుక్కలపై శనివారం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 4,113 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేసేందుకు 60 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 3వ తేదీ అందుబాటులో లేని చిన్నారులకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేస్తారని తెలిపారు.

49 కేంద్రాల్లో పల్స్‌పోలియో

వాకాడు: మండల వ్యాప్తంగా ఆదివారం నుంచి మూడు రోజులపాటు 49 కేంద్రాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ తోట గోపీనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదేళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఆ మేరకు 49 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 163 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

కోట: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిట్టేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి శనివారం సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. మండలంలో 2,926 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 24 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

కలువాయి: మండలంలోని తెలుగురాయపురంలో శనివారం పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందని, తల్లిదండ్రులు పిల్లలను తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయించాలని, నిండు జీవితానికి రెండు చుక్కలు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జీవీ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

- నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

గూడూరురూరల్: పట్టణంలో ఉన్న ధర్మరాజు స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం శనివారం ఆలయ ప్రాంగణంలో అట్టహాసంగా నిర్వహించారు. గతంలో ఉన్న పాలక మండలి కాలపరిమితం పూర్తికావడంతో నూతన పాలక మండలిని ఎంపిక చేసినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. నూతన పాలక మండలిలో ఎంపికైన సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకుని చైర్మన్‌గా బొమ్మిడి శ్రీనివాసులను ప్రతిపాదించి దేవదాయశాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో ఆలయ చైర్మన్ బొమ్మిడి శ్రీనివాసులను ప్రకటించడంతో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సభ్యులు గుబ్బా నరసింహారావు, బండి విజయ, దువ్వూరు వినయ్‌కుమార్, సోదింబాక సంపూర్ణ, మందిపాటి శ్రీనివాసులు, కుడుమల శ్రీవాణి, పల్లం వెంకటరత్నమ్మ, రాపూరు శాంతితో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పట్నం రామమునిలతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయ పాలక మండలిలో రెండవ పర్యాయం తనను చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు. తొలి విడతగా తనను ఎంపిక చేసిన సమయంలో దేవదాయశాఖ నిధులను రూ.40 లక్షలతో ఆలయ గోపుర శిఖరం నిర్మిస్తామని తెలిపారు. ధర్మరాజుల తిరునాళ్లను 30 ఏళ్ల క్రితం నిర్వహించారని ఈ ఏడాది తిరునాళ్లను నిర్వహించేలా చర్యలు చేపడతామని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని పాలక మండలిలో కూడా సగం మంది మహిళలకు స్థానం కల్పించారన్నారు.

31లోగా పన్నులు చెల్లించండి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరురూరల్: గూడూరు మున్సిపల్ పరిధిలోని పన్ను చెల్లింపుదారులు కార్పొరేషన్ అభివృద్ధికి తోడ్పాటును అందించేలా పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఏ. వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో ఖాళీ స్థలాలు, ఆస్తి, ఇంటి పన్నులు, కొళాయి పన్నులు గతంలో చెల్లించకుండా ఉన్న వారు ఈ నెలాఖరులోగా చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్‌దారులు రెన్యూవల్ చేసుకోవాలని, అలా చేసుకోని వారికి ఏప్రిల్ ఒకటి నుంచి అపరాధ రుసుము వేస్తామని కమిషనర్ అన్నారు.

సర్పంచ్‌కు నివాళి



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

వాకాడు: మండలంలోని రావిగుంటపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, గ్రామ సర్పంచ్ దేవారెడ్డి సురేంద్రరెడ్డి శనివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రభూషణ్‌రెడ్డి, పలువురు సర్పంచులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి



మాట్లాడుతున్న పీడీ జ్యోతి

నాయుడుపేటటౌన్: అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏడీ.జ్యోతి సిబ్బందిని ఆదేశించారు. మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం సూళ్లూరుపేట, గూడూరు డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించి ఏపీఎం, సీసీలతో పీడీ సమీక్ష నిర్వహించారు. జగనన్న తోడు, ఆసరా, చేయూత డీఆర్‌డీఏ అందిస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరు, అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పొదుపు మహిళల సంక్షేమం కోసం చేపడుతున్న పలు పథకాలు మహిళలకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అదేవిధంగా పలు బ్యాంక్‌ల ద్వారా అందుతున్న రుణాల టార్గెట్‌లను పూర్తి చేశారా లేదా, బ్యాంకులకు సంబంధించి సమస్యలను ఏపీఎంలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలకు సంబంధించి ఎంత మందికి పొదుపు రుణాలు అందించారు, ఇంకా ఎందరికి ఇవ్వాల్సి ఉందన్న వివరాలను పీడీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీడీతో పాటు ఐబీ డీపీఎం మాధవి, ఫైనాన్స్ డీపీఎం వెంకటేష్, చేయూత డీపీఎం వనజాక్షి, విజయ, జిల్లా యాంకర్ పర్సన్‌లు ఆదినారాయణ, సింగన్న, సుబ్బారెడ్డి, ఏపీడీ ప్రభావతి, ఏరియా కోఆర్డినేటర్‌లు మురళి, చంద్రబాబు పాల్గొన్నారు.

రూ.84 లక్షలతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు

గూడూరురూరల్: గూడూరురూరల్ పరిధిలోని అన్ని గ్రామాలకు జిల్లాపరిషత్ ద్వారా రూ.84 లక్షల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని తెలిపారు. నెలటూరులోని ఆమె నివాసంలో శనివారం అభివృద్ధి పనులపై విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాలాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతిఒక్కరూ పనిచేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ మెడనూలు శ్రీనివాసులరెడ్డి, విందూరు ఎంపీటీసీ వెంకటరెడ్డి, నెర్నూరు సర్పంచ్ చిన్నియ్య, నేతలు బత్తల పెంచలరావు, గోపాల్, కోటేశ్వరరావు, పెంచలరాజు, తిరుపాలయ్య, వెంకయ్య, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

కండలేరులో 9.964 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం 9.964 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 600 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5 , మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 10, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ ఇస్తున్న వలంటీర్

చిల్లకూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. తమ్మినపట్నంకు చెందిన కోలంగారి అన్నమ్మకు సామాజిక పింఛన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురికావడంతో ఆమెను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. దీంతో వలంటీర్ నవనీత నెల్లూరుకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

చిల్లకూరు: క్రిష్ణపట్నం పోర్టులో ఓడ నుంచి అన్‌లోడ్ చేస్తున్న బొగ్గు కన్వేయర్ వద్ద ప్రమాదంలో మృతిచెందిన గిరిజన యువకుల కుటుంబసభ్యులను అదానీ పోర్టు యాజమాన్యం ఆదుకోవాలని కుల నిర్మూలనా పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతిచెందిన గిరిజన యువకుల కుటుంబసభ్యులను వారు శనివారం పరామర్శించారు. కుల నిర్మూలనా పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కావలి బాలయ్య, జిల్లా కోశాధికారి ఎన్ పోలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శేఖర్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రతి పంటకు ఈక్రాప్ నమోదు

సైదాపురం: మండలంలోని ప్రతి పంటకు ఈక్రాప్ నమోదు చేశామని మండల వ్యవసాయాధికారిణి హైమావతి అన్నారు. సైదాపురంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం ఈపంట నమోదు చేసిన రైతుల వివరాలను ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం సాగుచేస్తున్న మొత్తం పంటలైన నిమ్మ, మామిడి, వరి పంటలను ఈపంటతో పాటు ఈకేవైసీ కూడా నమోదు చేశామన్నారు. మండలంలో 8,400 ఎకరాలను ఈపంట కింద నమోదు చేశామన్నారు. ఈపంట నమోదు చేసిన పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఉపసర్పంచ్ శివకుమార్‌యాదవ్, సహాయకురాలు పుష్ప పాల్గొన్నారు.

గ్యాస్‌లైన్ గుంతలు పూడ్పించాలి



కమిషనర్ జనార్దన్‌రెడ్డితో మేనేజర్ చాణిక్య

నాయుడుపేటటౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో గ్యాస్ పైప్‌లైన్‌ల కోసం తవ్విన గుంతలను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణలోనే పటిష్టంగా పూడ్పించాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శనివారం గ్యాస్ పరిశ్రమ మేనేజర్ చాణక్య కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల పైప్‌లైన్ల కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని వీటిని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పూడ్పించాలని చాణిక్యకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ వెంటే మైనార్టీలు



మాట్లాడుతున్న ముస్లిం నేతలు

గూడూరురూరల్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పలువురు ముస్లిం మైనార్టీ నేతలు త్వరలో జరగనున్న మైనార్టీ సమావేశంపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మగ్దూం మొహిద్దీన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఇందులో భాగంగానే కర్నూలులో మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ పోటీ చేసే అవకాశం కల్పించారని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ముస్లింలు 95 శాతం జగనన్న వెంటే ఉన్నారని తెలిపారు. గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ముస్లింల సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు పూర్తిచేశామని త్వరలోనే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్, కార్యదర్శి అబ్దుల్లా, పట్టణ అధ్యక్షుడు జహీర్, నేతలు అల్తాఫ్, బాబు మస్తాన్, ఖరిముల్లా షఫీ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కోట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓజిలికి చెందిన కోటి(44) మృతిచెందినట్లు ఎస్‌ఐ నాగబాబు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి చిట్టేడు వద్ద ప్రధాన రహదారిపై ఆటో, బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంగతి తెలిసిందే. ఓజిలికి చెందిన కోటి. ఇతను చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆటోలో చేపలు వేసుకుని కోటకు వెళుతుండగా చిట్టేడు వద్ద ఆటో, బస్సు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన కోటిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుని సోదరుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.